క్లుప్తంగా

'నా భర్త ఆచూకీ తెలపండి'


ఆనందబాబు(ఫైల్)

కదిరి టౌన్: తన భర్త ఆచూకీ తెలపాలని పట్టణంలోని జోన్నవీధికి చెందిన బోశెట్టి ఆనంద బాబు భార్య శారద పోలీసుల ఎదుట కోరింది. ఆనందబాబు ఈఏడాది ఫిబ్రవరి 14న భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి పోయి తిరిగి రాలేదు. ఆమె మరుసటి రోజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆరు నెలలైనా అతడి ఆచూకీ తెలియకపోవడంతో మరోసారి పోలీసులు కలిసి తన భర్తను తమ దగ్గరకు చేర్చాలని వేడుకుంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


తిప్పేనాయక్‌కు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

కదిరి అర్బన్: పట్నం జడ్పీహైస్కూల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న తిప్పేనాయక్‌కు శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు రూ.38 వేలు ఆర్థికసాయం చేశారు. తిప్పేనాయక్‌కు ఉన్న ఒక్కాగానొక్క కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. వైద్యం కోసం భారీగా ఖర్చు పెట్టారు. తిప్పేనాయక్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి రూ.15 వేలు, ఉపాధ్యాయులు రూ.23 వేలు అందజేశారు.

రైతు సేవ కేంద్రాల్లో ఈ-క్రాప్ జాబితా


జాబితాలో పేర్లను చదివి వినిపిస్తున్న సిబ్బంది

ఎన్పీకుంట: ఖరీఫ్‌కు సంబంధించి ఈ-క్రాప్ జాబితాను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఏఓ లోకేశ్వరరెడ్డి తెలిపారు. ఎన్పీకుంట-1 సచివాలయంలో శుక్రవారం రైతులతో కలిసి పంట నమోదు తుది జాబితాను ఆయన పరిశీలించారు. పంట సాగు చేసి నమోదు చేయించుకున్న ప్రతి రైతు తమ పేరు, సాగు చేసిన పంట వివరాలు, విస్తీర్ణం జాబితాలో సక్రమంగా ఉందా లేదా అని చూసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వరి రైతులు పొలాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపాలన్నారు. ప్రస్తుతం ఎరువులు వేయకూడదని, అవసరమైతే వర్షాలు తగ్గిన తరువాత వేసుకోవాలని సూచించారు.

స్టాక్ పాయింట్ తనిఖీ


స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: స్థానిక మార్కెట్‌యార్డులోని ప్రభుత్వ చౌక ధాన్యపు స్టాక్ పాయింట్‌ను ఆర్డీఓ మహేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న స్టాకు, రిజిస్టర్‌లో ఉన్న స్టాక్ వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న బ్యాగులను తూకాలు వేయించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సీఎస్‌డీటీ లక్ష్మిదేవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'ఈ- ఆఫీస్'పై ప్రత్యేక దృష్టి


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం అర్బన్: మున్సిపాలిటీలో ఈ ఆఫీస్ ద్వారానే ప్రతి ఫైళ్లు పంపాలని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

నేడు మంత్రి సత్యకుమార్ రాక

బత్తలపల్లి: మాల్యవంతం గ్రామానికి శనివారం రాష్ట్ర విద్య వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ రానున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఉపాధి హామీ కింద నిర్మించే సీసీరోడ్లకు ఆయన భూమిపూజ చేస్తారన్నారు.

చెరువులకు జలకళ వచ్చేనా?

ధర్మవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో వానలు దంచికొడుతున్నాయి. దీంతో చిన్నపాటి వంకలు పారుతున్నాయి. బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్న తరుణంలో వర్షాలు కురవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ధర్మవరం నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు నిండితే భూగర్భ జలాలు మెరుగుపడతాయని రైతులు చెబుతున్నారు. చెరువులు నిండితే బోరుబావుల్లో భూగర్భజలాలు పెరగడంతో పాటు ఆయకట్టు సాగులోకి వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.


నీరులేని పోతుకుంట చెరువు


ధర్మవరం చెరువులోకి చేరిన వర్షపు నీరు

చెరువులు నిండితే...

- ధర్మవరంలో 0.373 టీఎంసీల సామర్థ్యం కలిగిన చెరువు నిండితే 1,922 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. చుట్టుపక్కల 30 గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది.
- గొట్లూరు చెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.90 టీఎంసీలు. చెరువు నిండితే 542 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఎనిమిది గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి.
- రావులచెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.48 టీఎంసీలు. చెరువు పూర్తిస్థాయిలో నిండితే ఐదు గ్రామాల్లో భూగర్భజలాలు మెరుగవుతాయి. అంతేకాదు 488 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది.
- రేగాటిపల్లి చెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.40 టీఎంసీలు. చెరువులోకి నీరు చేరితే 135 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందడంతో పాటు నాలుగు గ్రామాల్లో భూగర్భజలాలు పెంపొందుతాయి.
- ఇక 0.13 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమున్న పోతుకుంట చెరువు జలకళ సంతరించుకుంటే 218 ఎకరాలకు సాగునీరందుతుంది. చుట్టుపక్కల గల మూడు గ్రామాల్లో భూగర్భజలాలు మెరుగవుతాయి.
- అప్రాచెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.84 టీఎంసీలు. ఈ చెరువు నిండితే సమీపంలోని ఐదు గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. అంతేకాదు 375 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది.
- ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 0.226 టీఎంసీలు. రిజర్వాయర్‌కు సమృద్ధిగా నీరు చేరితో చుట్టుపక్కల 60కి పైగా గ్రామాల్లో భూగర్భజలాలు పెంపొందుతాయి.12,880 ఎకరాల ఆయకట్టు సాగుకు ఢోకా ఉండదు.


యోగి వేమన జలాశయం

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయండి


జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వం మత రాజకీయలు ఆపి ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కొత్తచెరువులో సీపీఎం జిల్లా మహాసభకు సూచికగా కొత్తచెరువు కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డిసెంబర్ 1,2 తేదీల్లో పుట్టపర్తి వేదికగా జిల్లా మహాసభలు నిర్వహిస్తామన్నారు. ఇందులో గతంలో చేసిన కార్యక్రమాలపై సమీక్షతోపాటు వచ్చే మూడేళ్లలో చేపట్టే కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం తిరుమల లడ్డూను స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం దారుణమన్నారు. గత నెల 30న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పే ఇందుకు నిదర్శనమన్నారు. గుడి, బడి తేడా లేకుండా మద్యం దుకాణాలను అనమతిచ్చిందన్నారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్లఅంజి, నాయకులు ముత్యాలు, లక్ష్మన్న, పెద్దన్న పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరికి పాముకాటు


చికిత్స పొందుతున్న ముత్యాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు పాముకాటుకు గురయ్యారు. వివరాలు.. పట్టణంలోని శివానగర్‌కు చెందిన ముత్యాలు తిక్కస్వామి గుడి సమీపంలోని నీటి కాలువ వద్ద శుక్రవారం సాయంత్రం దుస్తులు ఉతుకుతుండగా పాము కరిచింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ముత్యాలును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇక కేతిరెడ్డి కాలనీకి చెందిన ఇంటర్ చదువుతున్న విద్యార్థి పురుషోత్తం శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళుతుండగా పాము కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పురుషోత్తంను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

ఓడిచెరువు: గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానికస్టేషన్లో వారు విలేకరులతో మాట్లాడారు. లాటరీ పద్ధతిలో మద్యం లైసెన్స్‌లు దక్కించుకున్నవారు అత్యుత్సాహంతో గ్రామాల్లో మద్యం విక్రయాలకు బెల్టుషాపులను ఏర్పాటు చేశారన్నారు. టీ కుంట్లపల్లి, గాజులకుంటపల్లి గ్రామాల్లో దాడులు చేసి ఆయా గ్రామాల్లోని బెల్టుషాపుల్లో 192 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

విషపురుగుల బెడద


పిచ్చిమొక్కలతో నిండిన శివాలయం దారి

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి గ్రామ నడిబొడ్డున శివాలయం నుంచి గొల్లవీధికి వెళ్లేదారిలో పిచ్చిమొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగింది. వీటిని శుభ్రం చేయకుండా వదిలేయడంతో విషపురుగులు తిరుగుతున్నాయి. ఈ వీధిలో తిరిగేవారు విషపురుగుల కాటుకు గురైన సందర్భాలూ లేకపోలేదు. వీధిని శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మెనూ పాటించండి


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసూన్‌కుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని యర్రంపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసూన్ కుమార్ నాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, పలు రికార్డులను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గాలీవానకు నేలకొరిగిన చెట్లను తొలగించాలన్నారు. అలాగే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. భోజనం రుచికరంగా ఉండాలని తెలిపారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం


శివంపల్లిలో పండ్లతోటల పెంపకం పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం.

నల్లచెరువు: ఉపాధి హామీ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని నల్లచెరువు మేజర్ పంచాయితీ సర్పంచ్ పంచరత్నమ్మ అన్నారు. నల్లచెరువు, ఓరువాయి పంచాయతీలో శుక్రవారం ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కె.పూలకుంట రోడ్డు రూ.10 లక్షలు, మందాలవాండ్లపల్లిలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు. ఏపీడీ రమేష్ బాబు, మాజీ ఎంపీపీలు శివారెడ్డి, మాబూసాబ్, ఏఓ రామకృష్ణ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కొండమనాయుని పాలెం, చిగురుమానుతండాల్లో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్డు నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామీ నిధులతో ఈ సీసీ రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. ఏపీఓ శ్రీధర్, పీఆర్ జేఈ గుప్తా, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుప్రకాష్, సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

తాడిమర్రి: శివంపల్లి, ఆత్మకూరు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏపీఓ సంజీవరెడ్డి పండ్లతోటల పెంపకం పనులకు భూమిపూజ చేశారు. సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, ఈఓఆర్డీ విజయ్ శేఖర్ నాయుడు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలంలోని బత్తలపల్లి, ఓబుళాపురం, తంబాపురం గ్రామ పంచాయతీల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తలపల్లిలో రూ.20 లక్షలతో సీసీరోడ్లు, తంబాపురంలో రూ.15 లక్షలతో పండ్లతోటల పెంపకం, ఓబుళాపురంలో రూ.10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. సర్పంచులు అక్కింకాశమ్మ, బండి సరస్వతి, సానే జయచంద్రారెడ్డి, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఓ ఆదెప్ప పాల్గొన్నారు.

ఉత్తర కర్ణాటక భక్తుల పర్తియాత్ర


సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్


సంగీత కచేరి నిర్వహిస్తున్న ఉత్తర కర్ణాటక సత్య సాయి భక్తులు

ప్రశాంతి నిలయం : ఉత్తర కర్ణాటకకు చెందిన సత్య సాయి భక్తులు పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేశారు. శుక్రవారం ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్య సాయి ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి సచ్చరిత్ర పారాయణం, సత్యసాయి అష్టోత్తర నామావళి చేపట్టారు. సాయంత్రం యుగయుగకే అవతార పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ సాగిన కచేరితో భక్తులు మైమరచిపోయారు. ఇదిలా ఉండగా సత్యసాయి మహాసమాధిని కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ దర్శించుకున్నారు.


సత్యసాయి అష్టోత్తర నామావళి నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయంలో చోరీకి విఫలయత్నం

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లి వద్ద ఉన్న యాతం బావి గంగమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫల యత్నం చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు.. దేవిరెడ్డిపల్లి పల్లి సమీపంలో ఉన్న యాతం బావి గంగమ్మ ఆలయంలో గురువారం అర్ధరాత్రి సమయంలో అమ్మవారి ఆభరణాలు చోరీ చేసేందుకు యత్నించారు. అయితే ఆలయ తాళం పగలగొట్టే సమయంలో శబ్దం రావడంతో గమనించిన స్థానికులు అప్రమత్తమై గట్టిగా కేకలు వేయడంతో దుండగులు తాము వచ్చిన కారులో పరారయ్యారు.

22 నుంచి ఆధార్ క్యాంపులు

ధర్మవరం రూరల్: ఈ నెల 22 నుంచి 25 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు వున్న ప్రతి విద్యార్థి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఒంటరి మహిళకు చేయూత


కుట్టుమిషన్ అందిస్తున్న సీఐ సునీత, ట్రస్ట్ సభ్యులు

పుట్టపర్తి టౌన్: ఒంటరి మహిళకు ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామానికి చెందిన ఒంటరి మహిళ పావనికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఆమె ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ట్రస్టు సభ్యులు అర్బన్ స్టేషన్‌లో సీఐ సునీత చేతుల మీదుగా శుక్రవారం కుట్టుమిషన్ అందజేశారు. సత్యసాయి బాబా సేవా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఏఎస్‌ఐ గంగన్న, ట్రస్టు సభ్యులు శ్రీకాంత్, మనోహర్, జావిద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు


జలమయమైన అంగన్‌వాడీ కేంద్రం

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలోకి శుక్రవారం వర్షం నీరు చేరింది. దీంతో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సమీపంలోని కొండ ప్రాంతంతో పాటు ఎయిర్‌పోర్టులోని వర్షపు నీరంతా కేంద్రంలోకి చేరుతోంది. దీంతో కేంద్రంలోని సరుకులు తడిసిపోతున్నాయి. మరోవైపు చిన్నారులు కేంద్రంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో వర్షపు నీరు చేరుతోందని సిబ్బంది చెబుతున్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు


చెట్టును జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఎన్పీకుంట: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై భారీ చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై చెట్టు కూలి పడింది. సర్పంచ్ ఆంజినమ్మ, పోలీసులు జేసీబీతో కూలిన చెట్టును తొలగించి, రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములు, జమేదార్ ఆజాద్, ఉన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం


నరసంపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు


మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్ కుమార్

చెన్నేకొత్తపల్లి: రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సురేష్ కుమార్ రైతులకు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ప్యాదిండి గ్రామంలో భూముల రీ సర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి నవంబర్ 4 వరకు మండల వ్యాప్తంగా గ్రామసభలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల రైతులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. విస్తీర్ణంలో వ్యత్యాసం, భూ స్వభావంలో తేడా, పేర్లలో తప్పులు, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడం, హద్దులు నిర్ణయంలో తేడాలు, తదితర సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సంతోషలక్ష్మి, గ్రామ సర్వేయర్ భాస్కర్, వీఆర్‌ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కనగానపల్లి: భూ సమగ్ర రీ సర్వేలో తలెత్తిన సమస్యలు ఏవైనా ఉంటే గ్రామ సభల ద్వారా పరిష్కరిస్తామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండలంలోని నరసంపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు, రైతులతో కలసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మండలంలోని నరసంపల్లి, ముత్తువకుంట్ల, కేఎస్ పాళ్యం, ఎలకుంట్ల గ్రామాల్లో భూ సర్వే చేపట్టామన్నారు. వీటిలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు మళ్లీ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని రైతుల వారి భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సర్పంచ్ చంద్రశేఖర్, సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేపై నేటి నుంచి గ్రామసభలు

ఎన్పీకుంట: మండలంలో భూముల రీసర్వే చేసిన గ్రామాల్లో శనివారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. గూటిబైలు, 22న ముడుపులజీవి గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో సర్వేపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని రైతులకు సూచించారు.

తలుపుల : బండ్లపల్లిలో శనివారం ఉదయం 9 గంటలకు భూముల రీసర్వేపై గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు. రీసర్వేలో సమస్యలపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు.

అమడగూరు: భూములు రీసర్వే చేసిన గ్రామాల్లో ఈనెల 21 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. 21న కరిమిరెడ్డిపల్లి, 23న ఎస్ కురువపల్లి, 24 న రామనాథపురం, 26 న గడిదంవారిపల్లి, 28 న చీకిరేవులపల్లి, 30న ఈడిగవారిపల్లి, నవంబర్ 1న పూలకుంటపల్లి, 2న కస్సముద్రంలో గ్రామ సభలను నిర్వహిస్తామన్నారు.

ఆలయానికి విరాళం

కదిరి అర్బన్: మండల పరిధితోనలి యర్రదొడ్డి గంగమ్మ ఆలయానికి శుక్రవారం నాగూరివాండ్లపల్లికి చెందిన ఇంద్రావతి అనే భక్తురాలు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృపేందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు